క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బాధ్యతల స్వీకరణ అనంతరం సిబ్బందితో సమావేశమైన తహసీల్దార్ రాములమ్మ

రేగిడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల తహసీల్దార్‌గా రాములమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి తహసీల్దార్‌కు దత్తిరాజేరుకు బదిలీ కాగా, ఆ స్థానంలోకి గుమ్మలక్ష్మీపురం నుంచి రాములమ్మ బదిలీపై వచ్చారు. అనంతరం ఆమె సిబ్బందితో సమావేశమై, రెవెన్యూ సమస్యలు, వాటి పరిష్కారం, గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితిపై ఆరాతీశారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

సంతాపం



మౌనం పాటిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బొబ్బిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బొండపల్లి మండల తహసీల్దార్ రమణయ్య మృతికి సిబ్బంది శనివారం సంతాపం ప్రకటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌లు బలివాడ గౌరీశంకర్, రెడ్డి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

వంగర: విద్యార్థులను నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని మగ్గూరు, ఓనెఅగ్రహారం, వంగర ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలలను శనివారం సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, పాఠశాలల రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతుల వారీగా వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు అంచనా వేశారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని తెలిపారు.

సమయపాలన పాటించాలి



ఆన్‌లైన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో బాలసుబ్రహ్మణ్యం

వంగర: సచివాలయాల్లో ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీవో ఎం.వి.బాలసుబ్రహ్మణ్యం సూచించారు. శనివారం మండలంలోని అరసాడ, మద్దువలస, వంగర గ్రామ సచివాలయాలను సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు, ఉద్యోగుల పనితీరును పరిశీలించారు. సచివాలయాల వారీగా ప్రజల నుంచి వచ్చిన వినతులు, పెండింగ్‌లో ఉన్న వినతులు, పరిష్కరించిన వినతులపై ఆరాతీశారు. ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో అధికారులు ఉండాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి

వంగర: ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ కె.సుధాకర్ తెలిపారు. స్థానిక సచివాలయంతో పాటు పోలింగ్ కేంద్రాన్ని శనివారం సందర్శించిన ఆయన పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంప్‌లు ఉండేలా చూడాలని తెలిపారు. ఓటర్ల ఫారాలను అప్‌డేట్ చేయాలన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని పరిశీలిస్తున్న వైద్యాధికారిణి శిరీష

రామభద్రపురం: మండలంలోని రొంపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన వైద్యాధికారిణి ఏఎల్‌జి శిరీష కొత్తకార్డుల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. పేదలకు రూపాయి ఖర్చు లేకుండా అనేక వ్యాధులకు ఆపరేషన్లు, చికిత్సలు అందించడమే లక్ష్యంగా ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు ప్రభుత్వం పెంచిందని తెలిపారు. గతంలో తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతీఒక్కరికీ ఆరోగ్యశ్రీ కార్డులను అందించేవారని, ప్రస్తుతం రూ.5 లక్షలు లోపు వార్షిక ఆదాయం ఉన్న వారందరికీ ప్రభుత్వం అందిస్తోందన్నారు. దీంతో లబ్ధిదారులంతా కార్పొరేట్ ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు, వైద్యసేవలు పొందవచ్చన్నారు.

మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యం

- వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



రేగిడి: మహిళలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

రేగిడి: మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత నిధుల చెక్కుల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. ప్రతిపక్ష నేత హోదాలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజా సంకల్పయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని ఆయన నెరవేర్చారన్నారు. దీనిలో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే స్వయం సహాయక సంఘాల మహిళల రుణాల వడ్డీని వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మాఫీ చేశారని తెలిపారు. గతంలో అధికారం కోసం టీడీపీ ఇదే హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చలేదన్నారు. ఎన్నికల వేళ చంద్రబాబు మళ్లీ ప్రజలను మాయమాటలతో నమ్మించి, మోసం చేసేందుకు సిద్ధమయ్యారని, ఆయన మాటలను ఎవరూ నమ్మవద్దన్నారు. రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగనన్న అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలతో మహిళలను ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. ప్రభుత్వ పథకాలు వినియోగించుకుని, ఎంతోమంది మహిళలు స్వయం ఉపాధి సాధించి, దర్జాగా బతుకుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఇదే సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ సీఎం జగనన్ననే ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. అంతకుముందు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన..

ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారదర్శక పాలన చేస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రావాల్సిన వడ్డీ నగదును నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేయడం ఆయన పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఉద్దేశ్యంతోనే సంక్షేమ పథకాల ద్వారా నగదు జమచేయడం జరుగుతోందన్నారు. అన్నివర్గాలను సమానంగా ఆదుకున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యే బరిలో ఉన్న డాక్టర్ తలే రాజేష్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మాట తప్పని నేత..

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పని నేత అని, ఇచ్చిన హామీలను నవరత్నాలు(పథకాలు) రూపంలో నెరవేర్చడమే కాకుండా మహిళలు ఆర్థికంగా ఎదగాలని వైఎస్సార్ చేయూత వంటి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక టీడీపీ నేతలు లేనిపోని ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని వాటిని నమ్మవద్దన్నారు.

రూ.41.50 కోట్ల లబ్ధి..

వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మాట్లాడుతూ రేగిడి మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.10.54 కోట్లు, నియోజకవర్గంలోని లబ్ధిదారులందరికీ మొత్తం నాలుగు విడతల్లో 1409 సంఘాల్లోని మహిళలకు రూ.41.50 కోట్ల నిధులు వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. రాజాం ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని, 2024 ఎన్నికల్లోనూ ఆయనకే అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీలు టి. అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ కె.సురేష్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ చిరంజీవి, ఎంపీడీవో జి.శ్యామలాకుమారి, తహసీల్దార్ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఆసరా పథకం..



నాకు వైఎస్సార్ ఆసరా పథకం అండగా నిలిచింది. ఇంటి అవసరాలు, పిల్లల చదువులకు ఈ డబ్బులు చాలా ఉపయోగపడ్డాయి. మహిళల ఆర్థిక ఎదుగుదలకు అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్నకే తన మద్దతు. ఆయన పాలన చాలా బాగుంది.

–జామి భవానీ, కందిశ, రేగిడి మండలం.

పాడిఆవు కొనుక్కొన్నా..



తమను ఇంతలా ఆదుకుంటున్న సీఎం జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. రానున్న ఎన్నికల్లోనూ ఆయనకే నా మద్దతు. ఆయన వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇచ్చిన డబ్బులు వ్యవసాయ పెట్టుబడులకు ఓసారి, మరోసారి అందిన నగదును ఓ పాడిఆవు కొనుగోలుకు ఉపయోగించాను.

–అల్తి కుమారి, బాలకవివలస, రేగిడి మండలం.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం



బాడంగి: వైఎస్సార్ ఆసరా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మహిళా సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం జరిగిన వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత నిధుల చెక్కుల పంపిణీకి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై, మహిళలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలు అమలు చేసిన ముఖ్యమంత్రిగా సరికొత్త రికార్డు సృష్టించారన్నారు. ఆయన ఇచ్చిన హామీల్లో ఒకటైన డ్వాక్రా రుణమాఫీ(స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణం)ని నాలుగు విడతల్లో నిధులు మంజూరు చేసి, హామీ నెరవేర్చారన్నారు. మండలంలోని 10,629 స్వయం సహాయక సంఘాల మహిళలకు మొత్తం రూ.18.83 కోట్లు వరకు అందజేశారన్నారు. తనను గెలిపిస్తే రాష్ట్రాన్ని మరో సింగపూర్ చేస్తానని చెప్పిన టీడీపీ అధినేత చంద్రబాబుకు గతంలో అధికారమిస్తే చెప్పుకోదగ్గ ఒక్క మంచి పనిచేసి తన పాలనా మార్క్ చూపించారా అని ప్రశ్నించారు. ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా సీఎం జగనన్న పథకాలు అమలు చేశారన్నారు. జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలతో మహిళలు తలెత్తుకుని జీవించేలా చేశారన్నారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్నడూ లేనంతగా నాడు–నేడు పేరుతో పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చి, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. ఇదే అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ సీఎం జగన్ననే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. అనంతరం వైఎస్సార్ ఆసరా చెక్కును మహిళలకు ఎమ్మెల్యే అందజేశారు. ఇదే కార్యక్రమంలో ఢిల్లీలో రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొన్న మండలంలోని ముగడ గ్రామానికి చెందిన తెంటు గౌరీశ్వరిని ఎమ్మెల్యే అభినందించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటనాయుడు, ఎంపీపీ భోగి గౌరి, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ ఎస్.శ్రీకాంత్, జెడ్పీటీసీ రామారావు పాల్గొన్నారు.

అప్పుల బెడద తప్పింది..



నాది బాడంగి మండలంలోని గొల్లాది గ్రామం. జగనన్న చేసిన డ్వాక్రా రుణమాఫీతో అప్పుల బెడద తప్పింది. ఆయన ఇచ్చిన వైఎస్సార్ చేయూత పథకం డబ్బులతో గొర్రెలు కొనుగోలు చేసుకున్నాను. నా భర్తకు పింఛన్ కూడా వస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రూ.లక్షల్లో లబ్ధి చేకూరింది. సంతోషంగా ఉంది. రానున్న ఎన్నికల్లోనూ జగనన్నకే నా ఓటు.

–మోర్ప చిట్టమ్మ, క్రాంతి పొదుపు సంఘం, ఆర్గనైజర్, గొలా

ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి



ఎంపీడీవో మధుసూదనరావుతో మాట్లాడుతున్న సబ్‌రిజిస్ట్రార్ పైడిరాజు

తెర్లాం: జగనన్న కాలనీ ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని తెర్లాం సబ్‌రిజిస్ట్రార్ ఎం.పైడిరాజు అన్నారు. మండల కేంద్రంలో ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తిలను శనివారం ఆయన కలిసి, రిజిస్ట్రేషన్ల ప్రక్రియపై కాసేపు మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సమన్వయంతో లబ్ధిదారులు తమ ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్లు ఆన్‌లైన్‌లో చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే తమను సంప్రదించాలన్నారు. ప్రతీ సచివాలయం నుంచి రోజుకు కనీసం 10 రిజిస్ట్రేషన్లు పూర్తి కావాలన్నారు. నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియను పూర్తి చేసేలా చూడాలని వారిని సబ్‌రిజిస్ట్రార్ కోరారు.

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని పేదలకు కేటాయించిన జగనన్న కాలనీ ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఆదేశించారు. శనివారం స్థానిక మాదిగ వీధిలోని సచివాలయాన్ని సందర్శించిన ఆయన రిజిస్ట్రేషన్లపై సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీవో మధుసూదనరావు

తెర్లాం: గ్రామపంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో మధుసూదనరావు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన గ్రామాలు అభివృద్ధి పథంలో నడవాలంటే పంచాయతీ కార్యదర్శులు.. సర్పంచ్‌లను సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. స్పందన కార్యక్రమంలో ప్రజలు సమర్పిస్తున్న వినతులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో తాగునీరు సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టి, గ్రామాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. అలాగే పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టాలన్నారు.

సీఎం జగన్‌తోనే అన్నివర్గాల సంక్షేమం



తలే రాజేష్‌కు ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని రామానుజలపేట, గుయ్యానవలస గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు ప్రభుత్వ పాలనపై హర్షం వ్యక్తం చేస్తూ తామందరికీ పథకాలు వస్తున్నాయని సంతోషంగా తెలిపారు. మరింత సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించి, మరోసారి జగనన్నను సీఎం చేయాలని కోరారు. ఆయన వెంట జెడ్పీటీసీ బి.నర్సింహులు, జేసీఎస్ కన్వీనర్ కె.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ వై.వెంకటేష్, ఎస్.వర్షిణిలు తదితరులు ఉన్నారు.

సమష్టి కృషితోనే మండల అభివృద్ధి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు

మెంటాడ: ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. శనివారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన నాలుగున్నరేళ్లుగా అన్నివర్గాలకు మేలు జరిగేలా అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అలాగే ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు, ప్రభుత్వ భవనాల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు కూడా చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలతో ప్రతీ ప్రాంతం అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యులంతా తీర్మానం చేస్తే మండల కేంద్రంలో పోలీస్ అవుట్‌పోస్టింగ్ ఏర్పాటుకు ఎస్పీని కోరుతామన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన అధికారులను శాఖల వారీగా అభివృద్ధి పనులు, కార్యక్రమాలపై నివేదిక తెలపాలన్నారు. ఈ క్రమంలో వ్యవసాయాధికారి గోకుల్ కృష్ణ మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు జరుగుతోందని, మండలంలో కొత్తగా 12 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు నిర్మిస్తున్నామని ఐసీడీఎస్ పీవో నాగలక్ష్మి తెలిపారు. ఏపీవో చిన్నప్పయ్య మాట్లాడుతూ మండలంలో 23 పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో రోజుకు 6,755 మంది వేతనదారులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీభాయ్, వైస్ ఎంపీపీ ఎస్. ఈశ్వరరావు, తహసీల్దార్ త్రినాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



ఎమ్మెల్యే శంబంగిని కలిసి వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

బాడంగి: మండల కేంద్రానికి శనివారం విచ్చేసిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పథకం ప్రారంభం నుంచి దాదాపు 17 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు కనీస వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కనీస వేతనం కింద రూ.27 వేలు ఇచ్చేలా చూడాలని, మ్యాండేట్ టార్గెట్ విధానం రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగోన్నతి కల్పించాలని, విధుల్లో ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల పరిహారం అందేలా చూడాలని కోరారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సస్యరక్షణ చేపట్టాలి

రేగిడి: రబీ సాగులో భాగంగా రైతులు పండిస్తున్న మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని బూరాడ, తోకలవలస, లక్ష్మణవలస గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను ఆయన శనివారం పరిశీలించారు. పంటను ప్రస్తుతం కత్తెరపురుగు ఆశిస్తోందని, రైతులు అప్రమత్తమై, ప్రాథమిక దశలోనే పురుగుమందు పిచికారీ చేయాలని తెలిపారు.

తహసీల్దార్ హత్య దారుణం

రామభద్రపురం: బొండపల్లి తహసీల్దార్ సనపల రమణయ్య హత్య దారుణమని రామభద్రపురం తహసీల్దార్ తహసీల్దార్ సులోచనరాణి విచారం వ్యక్తం చేశారు. హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయన హత్య పట్ల నల్లబ్యాడ్జీలు ధరించి, శనివారం నిరసన తెలిపారు. తహసీల్దార్ కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీ సుబ్బారావు, రీసర్వే డీటీ ఉమామహేశ్వరి, మండల సర్వేయర్ చంద్రశేఖర్, వీఆర్వోలు పువ్వల శ్రీనివాసరావు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మికులు

రాజాం సిటీ: తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు కోరుతున్నారు. ఇదే విషయమై మండల కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పీఎఫ్ సమస్య పరిష్కరించాలని, యూనిఫాం, పనిముట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, అనీల్, గురువులు, లక్ష్మి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) పేదలకు వరమని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని పెనుబాక గ్రామానికి చెందిన అల్లు సింహాద్రికి మంజూరైన రూ.70 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన చేతులమీదుగా మండల కేంద్రంలో శనివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న సింహాద్రి.. నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సాయం కోరగా, తక్షణమే మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్న వారందరినీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం అధ్యక్షుడు ఎల్.రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బి.నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ వై.వెంకటేష్, రాజాం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత



రామభద్రపురం: ఆస్పత్రిలో పెద్దయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాజు



వంగర: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ శ్రావణికుమారి

రామభద్రపురం: మండలంలోని రావివలస గ్రామానికి చెందిన టింగలి పెద్దయ్య అనారోగ్యానికి గురై, విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ సోముల రాజు తన సొంతడబ్బులతో చార్జీలు పెట్టుకుని, మరీ శనివారం ఆస్పత్రికి వెళ్లి, పెద్దయ్యకు పింఛన్ అందజేశాడు. దీంతో లబ్ధిదారు ఆనందం వ్యక్తం చేస్తూ వలంటీర్‌కు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

వంగర: శ్రీకాకుళం జిల్లాలోని బలగ దగ్గరున్న రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని అరసాడకు చెందిన కడగల భుజంగరావు వద్దకు వలంటీర్ మజ్జి శ్రావణికుమారి శనివారం వెళ్లి, పింఛన్ అందజేశారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు అందజేత



దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఏఎంసీ మార్కెట్ యార్డులో పలువురు దివ్యాంగులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందన్నారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న దివ్యాంగులకు రూ.21.85 లక్షల విలువైన మొత్తం 263 ఉపకరణాలను అందజేశారన్నారు. ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఎంపీపీ ఎస్.లక్ష్మీవేణుగోపాలనాయుడు, వైస్ చైర్మన్ రమాదేవి, ఎంపీడీవో పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.